



# సంఘర్షణ

**ఎం.వెంకటేశ్వరరావు**



క్రాస్‌రోడ్స్ దగ్గర్లో ఉందా కార్పొరేట్ ఆసుపత్రి. సమయం సాయంత్రం నాలుగ్గంటలు. సైకియాట్రిస్ట్ డాక్టర్ సదానందని చూడటానికి పేషెంట్లు వరసలో కూచున్నారు. చివరి వరసలో మధ్యలో కూచున్నాడు రాజేశ్వర్రావు. అతనికి కుడిపక్కన కూచున్నతను 'డబ్బు తింటే ఆకలి తీరుతుందా? తీరదా?' అని తనలో తాను గొణుక్కుంటూ, వేళ్లమీద ఏవో లెక్కలేస్తూ సడన్‌గా రాజేశ్వర్రావు భుజం తట్టి-

"మాస్టారూ! చిన్న డౌటు.. డబ్బుతో మనం కొనుక్కుని తినే బదులు, డబ్బునే తినేస్తే పోలా! శ్రమ తప్పుతుంది గదా! కాలం కూడా ఖర్చవ్వకుండా ఉంటుంది. ఔనంటారా? కాదంటారా?"

రాజేశ్వర్రావు కంగారుగా అతనివైపు చూసి "ఔనో.. కాదో.." అనేసరికి, "ఔనంటే కాదనిలే, కాదంటే ఔననిలే" అని పాటందుకున్నాడతను. అతన్ని తీసుకొచ్చిన బంధువు "రేయ్ ఆపరా బాబూ! ఇది ఆస్పత్రి" అని అతన్ని కంట్రోల్ చేస్తున్నాడు.

రాజేశ్వర్రావుకి ఎడమ పక్కన కూచున్నతను నిమిషానికోసారి "సార్! టైమెంతైంది?" అని అడుగుతున్నాడు. నాల్దైదు సార్లు చెప్పి, విసుగొచ్చి, అతనడిగినప్పుడల్లా వాచ్ ఉన్న తన చేతిని అతని కళ్ల ముందుంచుతున్నాడు చూసుకోమన్నట్టు. ముందు వరసలో కూచున్న వాళ్లలో ఒకతను లేచి వేగంగా పరుగెత్తబోతుంటే, భార్య అతన్ని లాక్కొచ్చి కూచోబెడ్తోంది. అతను మళ్లీ పరుగెత్తబోతుంటే రాజేశ్వర్రావు గబగబా లేచెళ్లి..

"యూ వాంట్ ఎనీ హెల్ప్" అనామెని అడిగేసరికి, ఆమె రాజేశ్వర్రావుని ఎగాదిగా చూసి "నో...నో..థ్యాంక్స్" అంది భయంగా మొహం పెట్టి.

అంతలో అక్కడ టోకెన్లిచ్చే లేడీ అటెండరు గబగబా లేచొచ్చి,

"సార్ మీరెళ్లి కూచోండి. మీ తాలూకు పేషెంటు ఎవరు?" అనడిగింది.

"నేనే పేషెంటు" అన్చెప్పాడు రాజేశ్వర్రావు.

ఆశ్చర్యంగా అతన్ని చూస్తూ 'అయ్యో! పాపం' అన్నట్టు ఎక్స్‌ప్రెషనిచ్చి

"వెళ్లి లైన్లో కూచోండి" అంది మూడు పదులు నిండని రాజేశ్వర్రావుతో.

ముప్పై నిమిషాల తర్వాత డాక్టర్ సదానంద ఛాంబర్లోకొచ్చిన రాజేశ్వర్రావుని చూసి కూచోమన్నాడు.

"చెప్పండి! వాటీజ్ యువర్ ప్రాబ్లం" అన్నాడు డాక్టర్ నవ్వుతూ.

"మై ప్రాబ్లం ఈజ్ వెరీ సింపుల్" అని ఓ క్షణం ఆగి,

"విన్నాక మీకు కష్టంగా కూడా అనిపించొచ్చు" అన్నాడు రాజేశ్వర్రావు.

"కష్టమా? తేలికా? అన్నది విన్న తర్వాత. ముందు సమస్యేంటో చెప్పండి"

"నన్ను మెగాస్టార్ చిరంజీవికి, మైక్రోసాఫ్ట్ బిల్‌గేట్స్‌కి అభిమానిగా మారిస్తే చాలు"

రాజేశ్వర్రావుని విచిత్రంగా చూస్తూ "ఇది నా దాకా తీసుకు రావాల్సిన సమస్య కాదేమో!" అన్నాడు డాక్టర్.

"నాకూ ఆ విషయం తెలుసు. అయితే నన్నలా మారనీయకుండా అనేక సమస్యలు అడ్డొస్తున్నాయి. అందుకే మీ దగ్గరకొచ్చింది" అన్నాడు దీనంగా మొహం పెట్టి.

"ఏంటో అవి?" అన్నాడు డాక్టర్ భృకుటి ముడిచి.

"ఏమని చెప్పను? ఎన్నని చెప్పను? నిత్యం అందరూ ఎదుర్కొనే సమస్యలే నావీ. కానీ అందరిలా చూస్తూ నాకెందుకులే అని తప్పుకు తిరగలేకపోతున్నాను. మిగతా వాళ్ల కంటికి నలుసుల్లా కనిపించే సమస్యలు, నా కంటికి పెనుభూతాల్లా కనిపిస్తున్నాయి"

"ఐ.సీ" అన్నాడు డాక్టరు సావధానంగా.

"ఉదయం నిద్రలేచింది మొదలు రాత్రి పడుకోబోయేవరకూ ఎటువైపు చూసినా మోసం. నైతికవిలువల్ని నట్టేట తొక్కుతూ స్వార్థంతో, సంస్కార రాహిత్యంతో సమాజాన్ని భ్రష్టుపట్టించే వాళ్లు పెరిగిపోతున్నారు"

"మీ ఒక్కరికే ఎందుకలా అనిపిస్తోంది?"


"ఎందుకంటే మోసగింపబడుతున్న వాళ్లలో నేనూ ఉన్నాను కాబట్టి. బళ్లో మోసం, గుళ్లో మోసం, ప్రజల్లో మోసం, ప్రభుత్వాల్లో మోసం ఎక్కడ చూసినా మోసం.. వేషం.. మోసం..."

"ఇలాంటివేనా? మీ సమస్యలు?" అన్నాడు డాక్టరు అడ్డొచ్చి.

"ఇంకా ఉన్నాయి. ప్రజల్లో సమాజ చింతన సన్నగిల్లిపోతోంది. పక్కవాణ్ని అణగదొక్కైనా సరే నేను అందలం ఎక్కితే చాలన్న స్వార్థమే ఎక్కడ చూసినా.

## నా పెళ్లి నా ఇష్టం

**ఆ**యేషా టకియా ఈమధ్య బాగా స్లిమ్‌గా మారింది. ఆ సంగతినే ఓ ఆసామీ ఆమెని అడిగితే- 'అవును గతంలో మరీ బొద్దుగా వుండేదాన్ని. స్టార్‌గా రాణించాలంటే కాస్త నాజూగ్గా వుండాలిగా. స్వీట్లు గట్రా బాగా తగ్గించేసాను. అలాగే ఇదివరకు టీ తెగ తాగేదాన్ని. ఆ అలవాటు కూడా బాగా తగ్గింది. అందుకనే స్లిమ్‌గా తయారయ్యాను' అంటూ తన కొత్త గెటప్ సంగతి చెబుతోంది. ఆమె పెళ్లి గురించి అడిగితే- 'నా పెళ్లి నా ఇష్టం. ఎప్పుడు చేసుకోవాలనిపిస్తే అప్పుడు చేసుకుంటాను. అందరికీ చెప్పే పెళ్లి చేసుకుంటాను, అంతదాకా కాస్త ఓపిక పట్టండి' అంటోంది.



తప్పుని చూసి తప్పించుకు పోలేకపోతున్నాను. ఆవేశపడి జోక్యం చేసుకుంటుంటే, నన్నో జోకర్లా చూస్తున్నారంతా. అవమానింపబడుతున్నాననీ తెలుసు. అయినా ఆవేశాన్ని అదుపు చేసుకోలేకపోతున్నాను"

"మీరే అనవసరంగా ఆలోచిస్తున్నారనుకుంటా?"

"మీరూ నన్ను అపార్థం చేసుకుంటున్నారు. మనిషికి సమాజాన్ని గురించిన అక్కర అవసరం లేదంటారా? మీరు కూడా స్వార్థపు సంకెళ్లలోనే ఉన్నట్టున్నారు. ఇందుకే ఈ సమాజం ఇలా నాశనమౌతోంది" అన్నాడు రాజేశ్వర్రావు ఆవేశంగా.


"మీకు ఇష్టం లేకపోతే పట్టించుకోకండి"

"అలా ఉండలేకపోతున్నాను. ఏ చిన్న తప్పు జరిగినా ఈ సమాజం ఏమవుతుందోనన్న భయం, ఆందోళన, ఆలోచనలతో మెదడు మొద్దుబారిపోతోంది" అన్నాడు తలపట్టుకుని.

"మీ ఆవేదన ఇతరులకి అర్థంకానపుడు ఇంటర్‌ఫియరవ్వకండి. మీ బలహీనత ఏంటో మీకు తెలిసినప్పుడు, మీ దృక్పథాన్ని మరో వైపు మళ్లించుకోండి. మీ ఆవేశాన్ని తగ్గించుకోవడానికి టీ.వి. చూడండి, పుస్తకాలు చదవండి, గేమ్స్ ఆడండి.. ఎనీ థింగ్.."

"బాగానే ఉంటుంది డాక్టర్. కానీ ఇవ్వాళ వందకిపైగా వస్తున్న టీవీ ఛానళ్లు చూడటం వలన ప్రజల మెదళ్లు ఆలోచించడం మానేస్తున్నాయి. ఏది నిజమో, ఏది అబద్ధమో., ఏది సువార్తో ఏది దుర్వార్తో తెలుసుకునే వ్యవధి లేకుండా వార్తల హోరు పెరిగిపోయింది. క్షణానికో తాజా వార్త, సెకనుకో సంచలన వార్త. మొన్నటికి మొన్న కమ్యూనిస్టుల భూపోరాటాలు, ముదిగొండ మారణహోమం, హైదరాబాద్‌లో బాంబుల పేలుళ్లు, ఫ్లైఓవర్ కుప్పకూలటం..., రచయిత్రి తస్లీమా నస్రీన్‌పై ప్రజాప్రతినిధుల దాడి... ఇలా రోజుకో వార్త, క్లిప్పింగుల్ని పదేపదే చూపుతూ యాంకర్లు అడిగే తిక్కప్రశ్నలు వినలేక చెవులు చిల్లులు పడుతున్నాయి. మెగాస్టారు కూతురు ప్రేమపెళ్లి సంచలన వార్తగా క్షణక్షణానికీ ప్రసారం చేస్తూ కదిలినా మెదిలినా గుచ్చిగుచ్చి ప్రశ్నలడుగుతూ రోజుల తరబడి విసిగించారు. వాడిగా వేడిగా మొదలైన శీతాకాలపు అసెంబ్లీ సమావేశాలు అసభ్య పదజాల ప్రయోగాలతో నువ్వు కుక్క అంటే, నువ్వు నక్క అనుకుంటూ మనం ఓటేసి గెలిపించిన ప్రజాప్రతినిధులు వాటిని పదేపదే ప్రసారం చేస్తూ, ప్రజాస్వామ్యంపై ప్రజల్లో మిగిలి ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నారు. అంతదాకా ఎందుకు? తాజా సంచలనవార్త.. స్కూల్ బస్‌లో ఓ కామాంధుడు పసిపిల్లలపై జరిపిన వికృత చేష్టల్ని, తట్టుకోలేని తల్లిదండ్రులు న్యాయం కోసం పోలీసుల వద్దకెళితే, మీడియా వాళ్లు ఆ పిల్లని పదేపదే చూపిస్తూ,

"జుగుప్స కలిగించే ప్రశ్నలేస్తూ టీవీల్లో చూపించడం అవసరమా? తలనెప్పి పుట్టి ఛానల్ మార్చిస్తే చాలు సినిమాలు, సీరియల్సు, డ్యాన్సులు తప్ప విజ్ఞానదాయకంగా ఒక్క అంశం కనిపించటం లేదు. ఇప్పుడు చెప్పండి డాక్టర్.. నన్నేం చెయ్యమంటారు?" అని మళ్లీ తలపట్టుక్కూచున్నాడు రాజేశ్వర్రావు.



అతని మాటల్లోని వాస్తవం అర్థమవుతున్నా ఈ డిప్రెషన్ అతన్నో స్ప్లిట్ పర్సనాలిటీలా మార్చే అవకాశం ఉందన్న విషయాన్ని గుర్తించిన డాక్టరు ఏదో చెప్పబోతుంటే మళ్లీ మొదలుపెట్టాడు.

"చూడండి! మెగాస్టారు రాజకీయాల్లోకి వస్తాడో లేదోనన్న అంశం ప్రజలని ఎంత పిచ్చివాళ్లని చేసిందో" అన్నాడు రాజేశ్వర్రావు ఆవేశంగా.

"ఒక్క నిమిషం నా మాట వినండి! ప్లీజ్! మీకున్న సమాజ చింతన హర్షించదగినదే. కుళ్లు చూపిస్తున్నాయని కళ్లని పొడుచుకోలేం గదా! మీరు ఆశిస్తున్నట్టు వ్యవస్థంతా మారిపోవాలంటే వీలవుతుందా? మీరు రైటనుకునే విషయం నాకు రాంగ్‌గా అనిపించొచ్చు. అందుకని మొదట మీ ఆలోచనలో మార్పు అవసరం"

"అదే డాక్టర్! నాక్కావల్సిందిప్పుడు. ఆ మార్పు కోసమే మీ దగ్గరకి వచ్చాను. అందుకే చిరంజీవికి అభిమానినైతే ఆయన తదుపరి చిత్రం ఏమిటి? ఆయన కూతుర్ని, అల్లుణ్ని ఇంటికి రానిస్తాడా? రాజకీయాల్లోకి ఎప్పుడు వస్తాడు? అలాగే.. ప్రపంచ ధనికుల జాబితాలో ప్రథమస్థానంలో ఉన్న ముఖేష్ అంబానీని బిల్‌గేట్స్ బీట్ చేసి మళ్లీ ప్రథమ స్థానం చేజిక్కించుకుంటాడా? లేదా? వంటి సమస్యలని మాత్రం ఆలోచిస్తూ మిగతావేవీ మనసుకి పట్టించుకోకుండా, లైట్ తీసుకుంటూ హాయిగా ఉండగలనేమో. ప్లీజ్ హెల్ప్ మీ డాక్టర్" అన్నాడు అభ్యర్థనగా.. డాక్టరు మొహం ప్రశాంతంగా పెట్టాడు.

"మీకు ఆకలేస్తోందా? నిద్ర పడుతోందా?" లాంటి ప్రశ్నలడుగుతూ, రాజేశ్వర్రావు బాధంతా, జవాబుల రూపంలో కొంతవరకూ రాబట్టి, కేసు హిస్టరీ తయారుచేసుకున్నాడు డాక్టర్ సదానంద.

"మీరు ఓ వారం రోజులు హాస్పిటల్లో అడ్మిట్టావ్వాల్సుంటుంది. మిమ్మల్ని అబ్జర్వేషన్లో ఉంచి, ట్రీట్‌మెంట్ ఇస్తాను"

"నో ప్రాబ్లం... ఇవ్వాళే అడ్మిట్టవ్వనా?"

"మీ ఇష్టం. కానీ మీ ఫ్యామిలీ మెంబర్స్ కానీ, మీకు తెలిసిన వాళ్లు గానీ ఈ పేపర్సులో సంతకం చేయాలి. మీకు పెళ్లయిందా?"

"లేదు"

"అయితే.. మీకు కావల్సిన వాళ్లనెవర్నైనా తీసుకురండి"

"అలాగే" అని లేచెళ్లాడు రాజేశ్వర్రావు.

○○○

మర్నాడు కొలీగ్ పున్నారావుని వెంటబెట్టుకునొచ్చి ఆసుపత్రిలో అడ్మిట్టయ్యాడు రాజేశ్వర్రావు. "అతన్ని రూంలో వదిలి, మీరోసారి నా ఛాంబర్‌కి రండి!" అన్నాడు డాక్టరు పున్నారావుతో.

పున్నారావు వచ్చాక...

"మీ ఫ్రెండ్‌కి ఎన్నాళ్లబట్టీ ఈ సోషల్ డిప్రెషన్.. ఐ మీన్ ఈ రకం సమాజ చింతన."

"ఎప్పుడూ అదే ఆలోచన డాక్టర్ అతనికి. దేశం, సమాజం అంటుంటాడెప్పుడూ. చిన్న తప్పు జరిగినా తట్టుకోలేడు. ఎన్నిసార్లు చెప్పినా... ఊ...హూ.."

"తప్పులేదు. అయితే ఇది ఒకలాంటి మానసిక అస్వస్థత. ఎవరిదో ప్రభావం మనసు మీద బలంగా ఉంటుంది. తరచూ అది మనసుని ఆధీనం తప్పిస్తుంటుంది. ఆ సమయంలో ప్రతీదీ నెగెటివ్‌గానూ, విపరీతంగానూ కనిపిస్తుంటాయి. అన్ని సమస్యలకీ అతిగా స్పందిస్తారు. దీన్నుంచి బయట పడాలంటే కేవలం మందులు చాలవు. తరచూ కౌన్సిలింగ్ అవసరం. కొంతకాలం పడుతుంది"

"నమ్మశక్యం గావటం లేదు డాక్టర్. రాజేశ్వర్రావు బాగా చదువుకున్నవాడు. చాలా మంచివాడు. ఉన్నత భావాలు కలవాడు. కానీ ఇలా..."

"చూడండి.. అతి మంచితనం, అతి ఆలోచనలు అనర్థాలకు దారితీస్తాయి. మంచివాడుగా ఉండాలనుకోవటం మంచిదే. కానీ మోతాదు మించితే కష్టం. మీరూ కో ఆపరేట్ చేయాలి" అన్నాడు డాక్టర్.

"తప్పకుండా డాక్టర్!" చెప్పాడు పున్నారావు.

## హాట్ హాట్ స్నేహా!

ఇంతకాలం ఫ్యామిలీ లైఫ్ గాళ్‌లా కనిపించిన స్నేహ ఇటీవలే కాస్త గ్లామరస్ భామలా మోడర్న్‌గా తయారవుతూ జనాల్ని ఆకట్టుకుంటోంది. తాజాగా మరో అడుగు ముందేసి- ఏకంగా కిస్సింగ్ సీన్‌లోనే నటించేసింది. తమిళ దర్శక నటుడు చేరన్‌తో హీరోయిన్‌గా నటిస్తున్న స్నేహ ఓ ఫస్ట్‌నైట్ సీన్‌కిగాను ఎంచక్కా లిప్ టు లిప్ కిస్‌కి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆ సినిమాకి ఇప్పుడు తెగ క్రేజ్ వచ్చేసిందిట. విచిత్రం ఏంటంటే- గతంలో కమల్ హాసన్‌తో ఇలాంటి ముద్దు సన్నివేశానికి 'నో' అన్న స్నేహ ఇప్పుడు ఇలా ఒప్పుకోవడం సినీజనాల్ని విస్మయానికి గురిచేసింది. కాలమహిమ అంటే ఇదే మరి!

